సంపుటి :02 సంచిక :239 పేజీలు :06
వెల ₹5
అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people
మంగళవారం 25, నవంబర్ 2025

# ఆపేదే లే..!

- కాటారం, మహాదేవపూర్ మండలా ఆగని హోల్సేల్ పేకాట
- ఇండ్లను మకాంగా మార్చుకుని ఆట
- తాజా మాజీ లీడర్లే పాత్రధారులు
- నిరంతరం సాగుతున్న హోల్సేల్ పేకాట
- జిల్లా పోలీస్ బాస్ పైనే అందరి చూపు

5లో..

## రేపు వరంగల్ కు కేటీఆర్ రాక..



అక్షరదర్బార్, హనుమకొండ: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం వరంగల్ నగరానికి రానున్నారు. ఉదయం 11 గంటలకు బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఈనెల 29న జరిగే దీక్ష దివాస్, స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో కేటీఆర్ పాల్గొంటారని మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి తెలిపారు. కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని పరకాల నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులను ఆయన కోరారు.



## మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు

- డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్
- అదే రోజు ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి
- ఎల్లుండి నుంచి తొలివిడత ఎన్నికల నామినేషన్ల స్వీకరణ
- 12,728 సర్పంచ్, 1,12,242 వార్డు స్థానాలకు ఎన్నికలు 04
- రాష్ట్రంలో 1.66 కోట్ల గ్రామీణ ఓటర్లు
- అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నగరా మోగింది. ఈమేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మంగళవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించబోతున్నట్లు స్పష్టం చేశారు. డిసెంబర్ 11, 14, 17వ తేదీల్లో పోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందని, పోలింగ్ జరిగిన రోజునే మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఆమె వెల్లడించారు. ఎన్నికల కోడ్ నేటి నుంచే అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. మూడు విడతల్లో రాష్ట్రంలో మొత్తం 12,728 సర్పంచ్ స్థానాలకు, 1,12,242 వార్డు స్థానాలకు పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు.

—అక్షరదర్బార్, హైదరాబాద్

## వరంగల్ లో 317 సర్పంచ్, 2,754 వార్డు స్థానాలు

- మూడు విడుతల్లో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు 04

## డీసీసీ పదవుల కేటాయింపులపై భిన్నాభిప్రాయాలు

- హనుమకొండలో 30 ఏళ్ల నుంచి రెడ్డి సామాజికవర్గానికే పీఠం
- వరంగల్లో ఊహించని విధంగా మైనార్టీ నేతకు పదవి
- తన అనుచరులకు దక్కలేదని కొండా పెదవివిరుపు
- ములుగులో ఇప్పటికే పదవి ఉన్నవారికే మళ్లీ అందలం
- భూపాలపల్లిలో తెరపై లేని నేతకు పదవి
- ములుగు, భూపాలపల్లి జిల్లాలో మంత్రులు సీతక్క, దుద్దిళ్ల హవా
- కాంగ్రెస్ అధిష్ఠానం వైఖరిపై విమర్శ



2లో..

# సీనియర్లు.. సమర్థులకు మొండి‘చేయి’?

కాంగ్రెస్ అధిష్ఠానం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు జిల్లాలకు ప్రకటించిన డీసీసీ అధ్యక్షుల జాబితా ఆశావహుల ఉత్సాహాన్ని నీరుగార్చింది. నియామకాలకు ముందు పార్టీ ప్రకటించిన ఐదేళ్ల సభ్యత్వం, మూడోసారి పదవి అవకాశం ఇవ్వకపోవడం వంటి నిబంధనలను తుంగలో తొక్కడంపై సీనియర్ నేతలు, పదవులు దక్కనివారు తీవ్రమైన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా హనుమకొండ జిల్లాలో 30 ఏళ్ల నుంచి రెడ్డి సామాజిక వర్గానికే మరోసారి పీఠం దక్కడంపై బీసీ, ఎస్సీ వర్గాలు తమకు అన్యాయం జరిగిందని బహిరంగంగానే వాపోతున్నాయి. వరంగల్, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో అనూహ్యంగా కొత్త వారికే పగ్గాలు దక్కాయి. మహబూబాబాద్లో ఎమ్మెల్యే మురళీనాయక్ సతీమణికి పదవి దక్కడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు తమ మాట నెగ్గించుకుని, వారి అనుచరులు పదవులు దక్కించుకున్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా 36 డీసీసీ పదవులు ప్రకటించగా వాటిలో ఒక్కటైనా, వెలమ సామాజికవర్గానికి కేటాయించలేదని ఆ వర్గానికి చెందిన నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. క్రితంసారి ఈవర్గం నుంచి నలుగురికి డీసీసీ పదవులు అప్పగించగా, ఈసారి పూర్తిగా మొండి చేయి చూపారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. — అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

## మానుకోటలో పోలింగ్ సరళి

- 482 పంచాయతీలకు పోలింగ్
- జిల్లాలో 4,110 వార్డులు
- ఏర్పాట్లలో నిమగ్నమైన యంత్రాంగం

04

## మున్సిపాలిటీగా నెక్కొండ




- బల్దియా ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- హైకోర్టు ఆదేశాల మేరకు నిర్ణయం
- మున్సిపాలిటీలో ఐదు పంచాయతీల విలీనం

## హనుమకొండ జిల్లాలో 210 పంచాయతీలు

- 1,986 వార్డు స్థానాలు
- మూడు విడతల్లో ఎన్నికలు

04

## మా అధికారం.. మా ఇష్టం!

- ఇసుక మాఫియాలో స్థానిక లీడర్ల 'హస్తం'
- ఇసుక క్వారీల్లో ఆగని అక్రమ వసూళ్ల దందా
- లోడింగ్ ఛార్జీలు ఇస్తేనే ఇసుక లోడింగ్
- మాయ చేస్తున్న బినామి కాంట్రాక్టర్లు
- యథేచ్చగా అక్రమ వసూళ్ల దందా



5లో..

# హామీల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- నెలకు రూ.2,500 మహాలక్ష్మి పథకం హామీ ఏమైంది?
- రాష్ట్రంలో ఒక్కో మహిళకు ప్రభుత్వం రూ.60 చొప్పున బాకీ ఉంది
- మాజీ మంత్రి హరీశ్ రావు నిలదీత



అక్షరదర్బార్, సిద్దిపేట: మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఆయన స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల పంపిణీ చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు బతుకమ్మ చీరెలు అందాయని, రాష్ట్రవ్యాప్తంగా 1.30 కోట్ల మందికి చీరెలు అందించామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కేవలం ఎస్ హెచ్ జీ గ్రూప్ లో ఉన్న 40 లక్షల మందికి మాత్రమే చీరెలు ఇస్తోందని మండిపడ్డారు. కేవలం ఒక్క చీరె ఇచ్చి సర్పంచ్ ఎన్నికల్లో ఓట్లు వేయాలని కోరడం సిగ్గుచేటని అన్నారు. ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద ఇస్తానన్న నెలకు రూ. 2500 హామీని మరచిపోయిందని నిప్పులు చెరిగారు. మహిళలందరికీ రెండేళ్ల బకాయి రూ.60 వేల చొప్పున అందజేయాలన్నారు. మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులు, వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ ఇస్తామని చెప్పి, రెండేళ్లు గడిచినా ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ఓట్ల కోసం మాత్రమే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, 'ఆశ పెట్టడం, ఆయాస పెట్టడం, మభ్య పెట్టడం, మోసం చేయడం' ఆయనకు అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు.

# డీసీసీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్‌ను కలిసిన కిషోర్ రెడ్డి



అక్షరదర్బార్, భూపాలపల్లి :24వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, మాజీ యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కలిసి, నూతనంగా డిసిసి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన బట్టు కరుణాకర్ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.ఈ కార్యక్రమంలో 24వ వార్డు కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు కిషోర్ రెడి వెంట మొహమ్మద్ ఇర్ఫాన్, మేనం తిరుపతి, కె.వి. అశోక్ గౌడ్, ఎండి షబీర్ ఖాన్ తదితర నాయకులు పాల్గొన్నారు.





# సీనియర్లు.. సమర్థులకు మొండి'చేయి'?

- డీసీసీ పదవుల కేటాయింపులపై భిన్నాభిప్రాయాలు
- హనుమకొండలో 30 ఏళ్ల నుంచి రెడ్డి సామాజికవర్గానికే పీఠం
- వరంగల్లో ఊహించని విధంగా మైనార్టీ నేతకు పదవి
- తన అనుచరులకు దక్కలేదని కొండా పెదవివిరుపు
- ములుగులో ఇప్పటికే పదవి ఉన్నవారికే మళ్లీ అందలం
- భూపాలపల్లిలో తెరపై లేని నేతకు పదవి
- ములుగు, భూపాలపల్లి జిల్లాలో మంత్రులు సీతక్క, దుద్దిళ్ల హవా
- కాంగ్రెస్ అధిష్ఠానం వైఖరిపై విమర్శలు

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :**

కాంగ్రెస్ అధిష్ఠానం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు జిల్లాలకు ప్రకటించిన డీసీసీ అధ్యక్షుల జాబితా ఆశావహుల ఉత్సాహాన్ని నీరుగార్చింది. నియామకాలకు ముందు పార్టీ ప్రకటించిన ఐదేళ్ల సభ్యత్వం, మూడోసారి పదవి అవకాశం ఇవ్వకపోవడం వంటి నిబంధనలను తుంగలో తొక్కడంపై సీనియర్ నేతలు, పదవులు దక్కనివారు తీవ్రమైన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా హనుమకొండ జిల్లాలో 30 ఏళ్ల నుంచి రెడ్డి సామాజిక వర్గానికే మరోసారి పీఠం దక్కడంపై బీసీ, ఎస్సీ వర్గాలు తమకు అన్యాయం జరిగిందని బహిరంగంగానే వాపోతున్నాయి. వరంగల్, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో అనూహ్యంగా కొత్త వారికే పగ్గాలు దక్కాయి. మహబూబాబాద్లో ఎమ్మెల్యే మురళీనాయక్ సతీమణికి పదవి దక్కడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు తమ మాట నెగ్గించుకుని, వారి అనుచరులు పదవులు దక్కించుకున్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా 36 డీసీసీ పదవులు ప్రకటించగా వాటిలో ఒక్కటైనా, వెలమ సామాజికవర్గానికి కేటాయించలేదని ఆ వర్గానికి చెందిన నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. క్రితంసారి ఈవర్గం నుంచి నలుగురికి డీసీసీ పదవులు అప్పగించగా, ఈసారి పూర్తిగా మొండి చేయి చూపారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## - వరంగల్ జిల్లా మైనారిటీ నేతకు పీఠం

వరంగల్ డీసీసీ అధ్యక్ష పదవిని మరోసారి దక్కించుకోవాలని ఆశించిన ఎర్రబెల్లి స్వర్ణకు కాంగ్రెస్ అధిష్ఠానం షాక్ ఇచ్చింది. ఊహించని విధంగా పార్టీ మైనార్టీ నేత ఆయూబ్‌ను పదవి వరించింది. ఆయనకు పదవి వస్తుందని ఎవరూ ఊహించలేదు. ఆయన నియామకంపై జిల్లాలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల నుంచి ఎలాంటి సానుకూలత లేకపోవడం గమనార్హం. ఆయూబ్ పదవి ఆశించకపోయినా, పదవి ఇచ్చారనే విమర్శలున్నాయి. మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ డీసీసీ పీఠాన్ని తన అనచరులైన గోపాల్ నవీన్ రాజు, మీసాల ప్రకాశ్కు దక్కాలని ఆశించగా, అధిష్ఠానం వారిని కాదని ఆయూబ్ వైపు మొగ్గు చూపడం జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. వరంగల్ జిల్లాలో ఎర్రబెల్లి స్వర్ణకు మరోసారి అవకాశం ఇవ్వకుండా, ములుగు జిల్లాలో పైడాకుల అశోక్‌కు మరోసారి డీసీసీ పదవి ఇవ్వడం వెనుక మంత్రి సీతక్క ఒత్తిడి ఉండి ఉండొచ్చని కూడా చర్చ జరుగుతోంది.

## - హనుమకొండ జిల్లాలో బీసీ, ఎస్సీలకు నిరాశ

హనుమకొండ జిల్లా డీసీసీ అధ్యక్ష పదవిపై బీసీ, ఎస్సీ సామాజికవర్గాలకు చెందిన కాంగ్రెస్ నేతలు భారీగా ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలో మూడు దశాబ్దాలుగా రెడ్డి సామాజిక వర్గానికే డీసీసీ పీఠం దక్కుతున్నది. ఈసారి బీసీలకు అవకాశం వస్తుందని మార్క విజయ్‌కుమార్, ఈవీవీ శ్రీనివాస్‌రావు, కట్ల శ్రీనివాస్ వంటి నేతలు దరఖాస్తు చేసుకున్నారు. సీనియర్ నేతలు దొమ్మటి సాంబయ్య, జంగా రాఘవరెడ్డి, పింగిళి వెంకట్రామ నర్సింహారెడ్డి, బీ అశోక్ రెడ్డి వంటివారు సైతం తీవ్రంగా ప్రయత్నించారు. అధిష్ఠానం అనూహ్యంగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డికే పదవిని కట్టబెట్టింది. ఇప్పటికే పదవులు ఉన్నవారికి కొత్త పదవి రాదని ప్రకటించిన అధిష్ఠానం.. తిరిగి కుడా చైర్మన్కే పదవి ఇవ్వడంపై బీసీ, ఎస్సీ సామాజిక వర్గం నేతల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది.

## - ములుగు జిల్లాలో మంత్రి సీతక్క హవా

ములుగు జిల్లాలో పదవి పాత డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్కే దక్కింది. మంత్రి సీతక్క అనుచరుడైన అశోక్‌కు మరోసారి డీసీసీ పదవి దక్కించుకున్నారు. పార్టీ నిబంధనల్లో ఇప్పటికే పదవి అనుభవిస్తున్నవారికి అవకాశం ఉండదని అధిష్ఠానం ప్రకటించింది. కానీ, మంత్రి సీతక్క తన అనుచరుడికి పట్టుబట్టి పదవి తెచ్చుకున్నారని తెలిసింది. ఈసారి కూడా అశోక్కే పదవి దక్కడంతో ఆశావహులు పెదవి విరుస్తున్నారు. ఇక అధిష్ఠానం నిబంధన ప్రకటించి ఏం లాభమని ప్రశ్నిస్తున్నారు.

## - భూపాలపల్లిలో మంత్రి దుద్దిళ్ల పంతం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా డీసీసీ అధ్యక్ష పదవి కోసం జిల్లావ్యాప్తంగా సుమారు వందమంది వరకు ఆశావహులు ప్రయత్నించారు. ఈ జాబితాలో గాజర్ల అశోక్, అప్పం కిషన్, చల్లూరి మధు వంటి కాంగ్రెస్ నేతలు ఉన్నారు. అధిష్ఠానం వీరందరినీ పక్కన పెట్టి భట్టు కర్ణాకర్ కి డీసీసీ పదవి కట్టబెట్టింది. 2009 నుంచి కాంగ్రెస్ పార్టీలో నామమాత్రంగా ఉంటున్న కర్ణాకర్ కు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అనుచరుడిగా పేరుంది. పదవి దక్కించుకునేందుకు కర్ణాకర్ కంటే సీనియర్లు, సమర్థత ఉన్నవారు పోటీ పడినప్పటికీ చివరకు కర్ణాకర్కు దక్కింది. స్థానిక భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తన అనుచరులకు పదవి ఇప్పించాలని ప్రయత్నించినప్పటికీ, మంత్రి శ్రీధర్బాబు పక్కా వ్యూహంతో ఎమ్మెల్యేను ఒప్పించి తన అనుచరుడికి పదవి దక్కేలా చేశారని తెలిసింది. ఎమ్మెల్యే అనుచరవర్గంలో కొందరు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ప్రయోజనం లేకపోయిందని వారు వాపోతున్నారు.

## - జనగామ జిల్లాలో ఎస్టీ మహిళకు..

జనగామ డీసీసీ పీఠం అనూహ్యంగా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ లకావత్ ధన్వంతికి (ఎస్టీ మహిళ) దక్కడం కాంగ్రెస్ నేతల్లో హాట్ టాపిక్‌గా మారింది. పదవి కోసం స్టేషన్ ఘన్పూర్ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన ఇందిరా కూడా ప్రయత్నించారు. ఆమెకు దక్కలేదు. పదవి దక్కించుకునేందుకు పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అత్త ఝాన్సీరెడ్డి తీవ్రంగా ప్రయత్నించారు. అలాగే, ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో పాటు ఆయన కుమారుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి సైతం దరఖాస్తు చేసుకున్నారు. ప్రశాంత్‌రెడ్డికి అధిష్ఠానం దాదాపు హామీ ఇచ్చిందనే ప్రచారం జరిగినా, అనూహ్యంగా ధన్వంతికి డీసీసీ పగ్గాలు చేజిక్కాయి. దీంతో ఉమ్మడి జిల్లాలోని జనగామ, మహబూబాబాద్ జిల్లాల డీసీసీ పదవులు ఎస్టీ మహిళలకు దక్కినట్లయింది.

## - మహబూబాబాద్ లో ఎమ్మెల్యే సతీమణికి

మహబూబాబాద్ డీసీసీ పీఠం పక్కాగా కాంగ్రెస్ నేత వెన్నం శ్రీకాంత్ రెడ్డికి దక్కుతుందనే ప్రచారం జరిగింది. ఆయనతోపాటు ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు భరత్ చందర్ రెడ్డి, ఇతర నేతలు ఘణపురం అంజ య్య, నునావాత్ రాధ వంటి 46 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే, అధిష్ఠానం వీరందరికీ ఝలక్ ఇస్తూ, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ సతీమణి, మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ భూక్య ఉమ (ఎస్టీ మహిళ)కు పదవి అప్పగించింది. దీంతో సీనియర్ నేతలు, ఆశావహుల్లో అసంతృప్తి వ్యక్తం అవుతున్నది. జిల్లాలో డీసీసీ నియామకంలో ఎమ్మెల్యే మురళీనాయక్ మాట నెగ్గిందని స్పష్టమవుతున్నది.

# జీహెచ్ఎంసీ విస్తరణకు కేబినెట్ ఆమోదం

- 27 మున్సిపాలిటీలు విలీనం
- సీఎం రేవంత్ అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం

అక్షరదర్బార్, హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) విస్తరణకు మంగళవారం తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. సచివాలయంలో సీఎం రేవంత్ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో ఈ నిర్ణయం ఖరారైంది. మొత్తం 27 మున్సిపాలిటీలు పెద్ద అంబర్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్, తుర్కయంజాల్, మణికొండ, నార్సింగి, ఆదిభట్ల, మేడ్చల్, నాగారం, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, కొంపల్లి, దుండిగల్, బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్, బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట, బోడుప్పల్, నిజాంపేట్, ఫిర్జాదిగూడ, జవహర్‌నగర్ మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించినట్లు సీఎం తెలిపారు. రాష్ట్రంలో మరో డిస్కమ్ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు.

# ఇళ్ల స్థలాల కోసం జర్నలిస్టుల వినూత్న నిరసన

**- రహదారిపై పడుకుని ఆందోళన చేసిన జర్నలిస్టులు**




అక్షరదర్బార్, భూపాలపల్లి : పట్టాలు ఇచ్చి రెండేళ్లవుతున్నా ఇళ్ల స్థలాలు చూపించకపోవడం పట్ల భూపాలపల్లి జిల్లా జర్నలిస్టులు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాలుగో రోజుకు చేరాయి.ఈ సందర్భంగా జర్నలిస్టులు 5 ఇంక్లైన్ ఆర్చ్ నుంచి డప్పుల చప్పుళ్లతో ర్యాలీ నిర్వహించి, "పట్టాలు ఇచ్చారు... స్థలాలు ఇవ్వడం మరిచారు" అంటూ నినాదాలు చేశారు. అనంతరం జయశంకర్ సార్ విగ్రహం చుట్టూ ప్రదక్షిణ చేసి, విగ్రహానికి పట్టాలు సమర్పించి నిరసన తెలిపారు. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన జర్నలిస్టులు, జాతీయ రహదారి పై పడుకొని ఆందోళనకు దిగారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే స్పందించి 37 మంది జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వెంటనే కేటాయించాలని, లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ప్రమాదాల నివారణకు రేడియం కటౌట్స్




అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండల కొత్తగట్టు సింగారం క్రాస్ రోడ్డు సమీపంలో ఇటీవల రోడ్డు ప్రమాదాలు జరిగినాయి.కావున పరకాల ఎసిపి సతీష్ బాబు చొరవ తీసుకొని రోడ్డు ప్రమాదాలు నివారించడానికి గాను రాత్రి సమయంలో (చీకటిలో) కూడా కన్పించే విదంగా త్రీడి రేడియం తో చేపించిన స్టీకర్లు (బోర్డింగ్స్ మరియు కటౌట్స్) గ్రామ క్రాస్ రోడ్డు సమీపంలో ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో శాయంపేట సిఐ పి. రంజిత్ రావు,శాయంపేట ఎస్ఐ జె పరమేశ్వర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# షష్టి జాతర ప్రారంభం..

- నేడు అష్టదిగ్బంధం
- రేపు ఊరేగింపుగా షష్టి బోనం..
- భక్తులకు అన్ని సౌకర్యాల కల్పించాం : కుంకుమేశ్వర ఆలయ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు.



షష్టిబొనంతో స్వామివారి గర్భాల

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలో దైవిక మహిమతో ప్రసిద్ధి చెందిన శ్రీ కుంకుమేశ్వర స్వామి ఆలయంలో షష్టి జాతరకు సిద్ధమౌతోంది. సాక్షాత్ పార్వతి దేవి తపస్సు ఫలితంగా ప్రతిష్ఠించిన దైవిక లింగంగా వెలసిన ఈ ఆలయం, ప్రతి సంవత్సరం జరిగే ఈ జాతర కారణంగా భక్తుల రద్దితో కళకళలాడుతుంది. జాతర సమయంలో ఆలయ పరిసరాలు భక్తి శ్రద్ధలతో నిండి ఉత్సవ వాతావరణాన్ని సంతరించుకుంటాయి. మంగళవారం సాయంత్రం ఆలయంలో పసుపుతో స్వామికి అభిషేకం చేసి అష్ట దిగ్బంధనం చేయడం జరుగుతుంది. బుధవారం యంలో ప్రవేశించగానే అభిషేకం చేసిన పసుపు కుంకుమగా మారి కుంకుమేశ్వరుడిగా మారిపోతాడు. పిలిస్తే పలికే కుంకుమేశ్వరుడి మహిమలు మనము కళ్ళారా వీక్షిస్తూ స్వామివారి కరుణాకటాక్షాలు పొందాలని కోరారు. ఈ ఏడాది జాతర కార్యక్రమాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. జాతర ఘట్టాలలో ప్రధానమైన షష్టి బోనంను బుధవారం సాయంత్రం 4 గంటలకు అయ్యగార్ల ఇంటి నుండి ఆలయానికి తీసుకురానున్నట్లు ఆలయ వర్గాలు తెలిపారు. బోనం ప్రారంభించే ముందు సంప్రదాయ పూజలు, మంగళవాద్యాలు, మహిళల పల్లకీ సేవలు, దేవతలకు ప్రత్యేక నైవేద్యాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో భక్తుల సమిష్టి పాల్గొనడం అత్యంత ప్రాముఖ్యమైందని పేర్కొంటూ, సకాలంలో అందరూ ఆలయ ప్రాంగణానికి చేరుకోవాలని కుంకుమేశ్వర ఆలయ చైర్మన్ కోలుగూరి రాజేశ్వర రావు విజ్ఞప్తి చేశారు. జాతర సంబరాలను భక్తులు కుటుంబ సమేతంగా ప్రత్యక్షంగా దర్శించుకోవాలని ఆయన సూచించారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు కూడా పూర్తిచేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు.జాతర సందర్భంగా ప్రత్యేక దర్శనం, అన్న సమర్పణ కార్యక్రమాలు కూడా ఉండనున్నాయి. పరకాల మరియు పరిసర ప్రాంతాల భక్తులు పెద్దఎత్తున పాల్గొని శ్రీ కుంకుమేశ్వర స్వామి కటాక్షం పొందాలని ఆలయ కమిటీ కోరింది.




## నిధులు సరిపోక ఇందిరమ్మ లబ్ధిదారుల ఇబ్బందులు

**ఎంసీపీఐ మండల కార్యదర్శి మర్రిపెల్లి మొగిలి**

అక్షరదర్బార్, కేసముద్రం : ఇందిరమ్మ పథకంలో మంజూరైన లబ్ధిదారులు ప్రభుత్వం ఇచ్చే నిధులు సరిపోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంసీపీఐ మండల కార్యదర్శి మర్రిపెల్లి మొగిలి తెలిపారు. కేసముద్రం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ మోడల్ హౌస్ వద్ద మంగళవారం పాత్రికేయులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారునికి రూ. 5 లక్షలు మంజూరు చేస్తుండగా, అవగాహన లోపంతో చాలామంది రూ. 15–20 లక్షల వరకు అప్పులు చేసి ఇళ్లు నిర్మిస్తున్నారని, దీంతో వారు అప్పుల బారిన పడుతున్నారని మొగిలి ఆవేదన వ్యక్తం చేశారు. మోడల్ హౌస్‌ను లబ్ధిదారులకు చూపకపోవడమే దీనికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. రెండో దశ ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు మండల పరిషత్ కార్యాలయంలోని నమూనా ఇల్లును చూపించి, అదే ప్రమాణాలతో నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు సూచించారు. ఈ మేరకు ఎంపీడీవో క్రాంతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యవర్గ సభ్యుడు జాటోతు బిచ్యానాయక్, దయ్యాల కుమారస్వామి పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో కమ్యూనిస్టులను ఆదరించాలి

**: సీపీఐ మండల కన్వీనర్ శేఖర్**




అక్షరదర్బార్, కేసముద్రం : రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కమ్యూనిస్టులను ఆదరించాలని సీపీఐ మండల కన్వీనర్ చొప్పరి శేఖర్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి మంద భాస్కర్ పిలుపునిచ్చారు. కేసముద్రం సిపిఐ కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామ పం చాయతీ పాలనలో కమ్యూనిస్టులకు అవకాశం లభిస్తే ప్రజా సమ స్యలు వేగవంతంగా పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. రాబో యే ఎన్నికల్లో కేసముద్రం మండలంలోని ఐదు గ్రామాల్లో సర్పంచ్ పదవులకు, అలాగే 70 వార్డుల్లో సిపిఐ అభ్యర్థులు పోటీ చేయనున్నట్లు శేఖర్ వెల్లడించారు. సమావేశంలో మడత నారాయణ, దాసరి సాయిలు, భిక్షపతి తదితర నాయకులు పాల్గొన్నారు.




# వడ్డీలేని రుణాలతో ఆర్థిక భరోసా

**: కలెక్టర్ దివాకర్ టీఎస్**

అక్షరదర్బార్, ములుగు ప్రతినిధి : వడ్డీ లేని రుణాలు మహిళలకు ఆర్థిక భరోసా అందిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకొని మహిళలు ఆకాశమే హద్దుగా ఎదగాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ములుగు నియోజకవర్గంలోని 9 మండలాల స్వయం సహాయక సంఘాలకు రూ. 2 కోట్లు 26 లక్షలు 76 వేల విలువైన వడ్డీలేని రుణాలు పంపిణీ చేశారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్ మాట్లాడుతూ మహిళా సంఘాల ఆధ్వర్యంలో త్వరలో ములుగులో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్డీఓ శ్రీనివాస్ రావు, ఎల్డీఎం జయ ప్రకాష్, ఏపీడీ శ్రీనివాస్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# నూతన విత్తన చట్టంపై అవగాహన సదస్సు

**రైతులకు సబ్సిడీ విత్తనాల పంపిణీ**




అక్షరదర్బార్, పరకాల : రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నూతన విత్తన చట్టం–2025 ముసాయిదాపై రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల్లో ప్రత్యక్ష వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరకాల మండలం నడికూడ రైతు వేదికలో ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు జగదీశ్వర్ రెడ్డి పాల్గొని రైతులకు సబ్సిడీ విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ.. నూతన విత్తన చట్టంలో రైతు రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, విత్తనంతో నష్టం కలిగితే నష్టపరిహారం చెల్లించే నిబంధనలు తప్పనిసరిగా ఉండాలని కోరారు. వరి, మొక్కజొన్న విత్తన సాగు చేసే రైతులు కంపెనీలతో అగ్రిమెంట్ చేసుకుని మాత్రమే విత్తనాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పోరిక జైసింగ్, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రదీప్ కుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# 'స్థానిక' ఎన్నికలను వాయిదా వేయాలి



అక్షర దర్బార్, పరకాల: స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేయాలని పరకాల మండల బీసీ–ఎస్సీ–ఎస్టీ జేఏసీ కోఆర్డినేటర్ చుక్క రత్నాకర్ డిమాండ్ చేశారు. 2023 ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి బీసీలకు 42% రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు కేవలం 23% రిజర్వేషన్లతో జీఓ 46 విడుదల చేసి బీసీలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అఖిల పక్ష సమావేశం నిర్వహించాలని, అన్ని పార్టీలతో కలిసి ప్రధానమంత్రిని కలిసి మాట్లాడాలని, 42% బీసీ రిజర్వేషన్లు కేంద్రం ఆమోదం పొందించి 9వ షెడ్యూల్‌లో చేర్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా భారీ ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.




# మున్సిపాలిటీగా నెక్కొండ

- బల్దియా ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- హైకోర్టు ఆదేశాల మేరకు నిర్ణయం
- మున్సిపాలిటీలో ఐదు పంచాయతీల విలీనం

అక్షరదర్బార్, వరంగల్ : వరంగల్ జిల్లాలోని నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా గుర్తిస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ మేరకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులోకి రాకముందే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. సొంటిరెడ్డి యమునారెడ్డి అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై ఇటీవల విచారణ జరిపిన న్యాయస్థానం నెక్కొండను మున్సిపాలిటీగా గుర్తించాలని ప్రభుత్వానికి సూచించింది. ఈ ప్రకటనతో వరంగల్ జిల్లాలో నర్సంపేట, వర్ధన్నపేట, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ల సరసన నాలుగో మున్సిపాలిటీగా నెక్కొండ చేరింది. తాజాగా ప్రకటనతో సమీప పంచాయతీలైన అమీన్‌పేట, గుండ్రపల్లి, పత్తిపాక, నెక్కొండ తండా, టీకే తండాలు సైతం నెక్కొండలో విలీనం కానున్నాయి.

### - అర్హతలివి..

ఏదైనా ఒక మేజర్ పంచాయతీ, లేదా పంచాయతీ మున్సిపాలిటీగా మారాలంటే అందుకు కొన్ని అర్హతలు ఉండాలి. నెక్కొండ పరిధిలో సుమారు 10 వేలకు పైగా జనాభా ఉంది. ఇది మున్సిపాలిటీ ఏర్పాటుకు అవసరమైన ప్రమాణం. చుట్టుపక్కల ఐదు గ్రామాలను విలీనం చేయడం ద్వారా జనాభా మరింత పెరుగుతుంది. నెక్కొండ డివిజన్‌లో నర్సంపేట తర్వాత అతిపెద్ద మండల కేంద్రం ఇదే. ఇక్కడ రైల్వే స్టేషన్, రైల్వే ఎఫ్‌సీఐ గోదాములు, స్వయం ప్రతిపత్తి గల వ్యవసాయ మార్కెట్ వంటి మౌలిక వసతులు ఉన్నాయి. రవాణాపరమైన, వాణిజ్యపరమైన అనుసంధానానికి అవసరమైన వనరులు ఉన్నాయి. ఈ అంశాలన్నీ కలిసి నెక్కొండ మున్సిపాలిటీగా మారేందుకు దోహదపడ్డాయి.

### - అభివృద్ధికి బాటలు

మున్సిపాలిటీగా మారడంతో ఈ ప్రాంతానికి పట్టణ ప్రణాళికలో భాగంగా కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విరివిగా నిధులు విడులవుతాయి. నిధుల ద్వారా ఈ ప్రాంత ప్రజలకు మౌలిక వసతుల కల్పన వేగవంతం అవుతుంది. ముఖ్యంగా రోడ్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థలు, ఆధునిక పారిశుద్ధ్య సేవలు, తాగునీటి సరఫరా వంటి సదుపాయాలు మెరుగుపడతాయి. అలాగే బస్టాండులు, మార్కెట్ యార్డులు, పార్కుల నిర్మాణానికి అడుగులు పడతాయి. విలీనమయ్యే గ్రామాల రూపురేఖలు కూడా మారతాయి. రియల్ ఎస్టేట్, వ్యాపార కార్యకలాపాలు అమాంతం పెరిగేందుకు ఆస్కారం ఏర్పడుంది.

# రైతు భరోసా విడుదల చేయాలి

**వరంగల్ జిల్లా రైతు రక్షణ సమితి అధ్యక్షుడు వరికెల కిషన్ రావు**



అక్షర దర్బార్, పరకాల: తెలంగాణలో అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతిని రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, వెంటనే రైతు భరోసా విడుదల చేయాలని వరంగల్ ఉమ్మడి జిల్లా రైతు రక్షణ సమితి అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు ప్రభుత్వంను డిమాండ్ చేశారు. పత్తి, మిరప, మొక్కజొన్న, వరి పంటలు నష్టపోయి దిగుబడి తగ్గడంతో రైతులు అప్పుల్లో కూరుకుపోయారని, యాసంగి సాగు ముందు వారికి ఆర్థిక సాయం అత్యవసరమని తెలిపారు.

# 317 సర్పంచ్, 2,754 వార్డు స్థానాలు

**- మూడు విడుతల్లో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు**

అక్షరదర్బార్, వరంగల్: పంచాయతీ ఎన్నికల నిర్వహణకు వరంగల్ జిల్లాలో అధికారులు మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో వరంగల్ జిల్లాలోని 317 గ్రామపంచాయతీల్లో 317 సర్పంచ్, 2,754 వార్డు స్థానాలకు మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం నిర్ణయించింది.

జిల్లాలో తొలివిడతలో వర్ధన్నపేట, పర్వతగిరి రాయపర్తి మండలాల్లోని 91 సర్పంచ్, 800 వార్డు స్థానాలకు, రెండో విడతలో దుగ్గొండి, నల్లబెల్లి, గీసుకొండ, సంగెం మండలాల్లోని 117 సర్పంచ్, 1,008 వార్డు స్థానాలకు, మూడో విడత నర్సంపేట, ఖానాపురం, చెన్నారావుపేట, నెక్కొండ మండలాల్లోని 109 సర్పంచ్, 946 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు వార్డుకో పోలింగ్ కేంద్రం చొప్పున జిల్లాలో మొత్తం 2,754 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అధికారులు నిర్ణయించారు.



# మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు

- డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్
- అదే రోజు ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి
- ఎల్లుండి నుంచి తొలివిడత ఎన్నికల నామినేషన్ల స్వీకరణ
- 12,728 సర్పంచ్, 1,12,242 వార్డు స్థానాలకు ఎన్నికలు
- రాష్ట్రంలో 1.66 కోట్ల గ్రామీణ ఓటర్లు
- అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని




అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నగరా మోగింది. ఈమేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మంగళవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించబోతున్నట్లు స్పష్టం చేశారు. డిసెంబర్ 11, 14, 17వ తేదీల్లో పోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందని, పోలింగ్ జరిగిన రోజునే మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఆమె వెల్లడించారు. ఎన్నికల కోడ్ నేటి నుంచే అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. మూడు విడతల్లో రాష్ట్రంలో మొత్తం 12,728 సర్పంచ్ స్థానాలకు, 1,12,242 వార్డు స్థానాలకు పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. తొలి విడతలో 4,236 సర్పంచ్ స్థానాలు, 37,440 వార్డు స్థానాలకు, రెండో విడతలో 4,333 సర్పంచ్ స్థానాలు, 38,350 వార్డు స్థానాలకు, మూడో విడతలో 4,159 సర్పంచ్ స్థానాలు, 36,450 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ చెప్పారు. రాష్ట్రంలో 1.66 లక్షల మంది గ్రామీణ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు.

### - నామినేషన్ల స్వీకరణ ఇలా

*పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఈనెల 27 నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలు కానుంది. డిసెంబరు 11న జరిగే తొలి విడత ఎన్నికలకు ఎల్లుండి నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమై 29న సాయంత్రం ఐదు గంటలకు ముగియనుంది. 30న నామినేషన్ల పరిశీలన జరిగితే డిసెంబర్ 3న నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు. డిసెంబర్ 14న జరిగే రెండో విడత ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ఈనెల 30న ప్రారంభమై డిసెంబర్ 2వ తేదీ సాయంత్రం 5 గంటలకు ముగియనుంది. డిసెంబర్ 3న నామినేషన్ల పరిశీలన జరిగితే నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు డిసెంబర్ 6. డిసెంబర్ 17న జరిగే మూడో విడత ఎన్నికల నామినేషన్ల స్వీకరణ డిసెంబర్ 3న ప్రారంభమై 5న సాయంత్రం 5 గంటలకు ముగియనుంది. 6న నామినేషన్ల పరిశీలన జరిగితే నామినేషన్ల ఉపసంహరణకు 9వ తేదీ తుది గడువుగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ప్రకటించారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్లు లెక్కించిన తర్వాత అదే రోజు ఎన్నికల ఫలితాలను అధికారులు ప్రకటిస్తారు.*

# హనుమకొండ జిల్లాలో 210 పంచాయతీలు

- 1,986 వార్డు స్థానాలు
- మూడు విడతల్లో ఎన్నికలు

అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండ జిల్లాలో 210 గ్రామపంచాయతీల్లో మూడు విడతల ఎన్నికలు నిర్వహించాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో హనుమకొండ జిల్లాలో 210 సర్పంచ్, 1986 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. జిల్లాలో తొలి విడత భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపురం మండలాల్లోని 69 సర్పంచ్, 658 వార్డు స్థానాలకు, రెండో విడత ధర్మసాగర్, హసన్ పర్తి, ఐనవోలు, వేలేరు, పరకాల మండలాల్లోని 73 సర్పంచ్, 694 వార్డు స్థానాలకు, మూడో విడత ఆత్మకూరు, దామెర, నడికూడ, శాయంపేట మండలాల్లోని 68 సర్పంచ్, 634 వార్డు స్థానాలకు పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు జిల్లాలో 1986 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

# మానుకోటలో పోలింగ్ సరళి

- 482 పంచాయతీలకు పోలింగ్
- జిల్లాలో 4,110 వార్డులు
- ఏర్పాట్లలో నిమగ్నమైన యంత్రాంగం



అక్షరదర్బార్, మహబూబాబాద్: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లాలో మూడు విడతల్లో నిర్వహించేందుకు యంత్రాంగం ఏర్పాట్లు చేయనుంది. కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు నివేదికను సమర్పించారు. జిల్లాలో మొత్తం 482 గ్రామ పంచాయతీలు, 4,110 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన తేదీలు త్వరలోనే ప్రకటించనున్నారు.

### - మొదటి విడతలో

మొదటి విడుతలో మహబూబాబాద్, తొర్రూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 155 పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. మహబూబాబాద్ రెవెన్యూ డివిజన్లోని గూడూరు, ఇనుగుర్తి, కేసముద్రం, మహబూబాబాద్ మండలాలు, తొర్రూరు రెవెన్యూ డివిజన్లో నెల్లికుదురు మండలాల్లో పోలింగ్ జరుగనుంది. రెండు డవిజన్లు కలిపి 1,338 వార్డులు ఉన్నాయి.

### - రెండవ విడతలో

రెండవ విడతలో మహబూబాబాద్, తొర్రూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 158 పంచాయతీలలో పోలింగ్ జరుగనుంది. మహబూబాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని బయ్యా రం, చిన్నగూడూరు, గార్ల మండలాలు, తొర్రూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని దంతాలపల్లి, నర్సింహులపేట, పెద్దవంగర, తొర్రూరు మండలాల్లో ఎన్నికలు జరుగనున్నాయి. మొత్తం 1,360 వార్డులకు పోలింగ్ జరుగనుంది.

### - మూడవ విడతలో

మూడో విడతలో మహబూబాబాద్, తొర్రూరు రెవెన్యూ డివిజన్లలోని మిగిలిన ప్రాంతాలకు పోలింగ్ జరగనుంది. 169 పంచాయతీల్లోని 1,412 వార్డులలో ఎన్నికలు నిర్వహించనున్నారు. మహబూబాబాద్ రెవెన్యూ డివిజన్లో డోర్నకల్, గాంగారం, కొత్తగూడ, కురవి మండలాలు, తొర్రూరు రెవెన్యూ డివిజన్లో మరిపెడ మండలంలో పోలింగ్ జరుగనుంది.

# స్త్రీ హింస నిర్మూలనకు కృషి చేయాలి



అక్షర దర్బార్, శాయంపేట : ప్రగతి సింగారం గ్రామ పంచాయతీ ఆవరణలో అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినం సందర్భంగా ప్రజ్వల్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలతో అవగాహన సమావేశం నిర్వహించారు. సంస్థ ప్రతినిధి షేక్ గౌస్ మాట్లాడుతూ గృహహింస, లైంగిక వేధింపులు పెరుగుతున్న నేపథ్యంలో మహిళల రక్షణ కోసం 1999లో ఐక్యరాజ్యసమితి తీర్మానం ప్రకారం ప్రతి సంవత్సరం నవంబర్ 25ను స్త్రీ హింస వ్యతిరేక దినంగా పాటిస్తున్నట్టు తెలిపారు. స్త్రీలు పురుషులతో సమాన గౌరవం పొందాలన్నారు. గ్రామ పెద్దలు రఘుపతి రెడ్డి మాట్లాడుతూ మహిళలు గౌరవించబడే చోటే శాంతి స్థిరపడుతుందని తెలిపారు. ప్రజ్వల్ సంస్థ ద్వారా మహిళా స్వయం ఉపాధి కోసం కుట్టు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో భానుమతి, ఆదిరెడ్డి, సుధాకర్ రెడ్డి, మల్లేశం, రాజయ్య, శ్రీను, తాళ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ**



అక్షర దర్బార్, మొగుళ్లపల్లి : మహిళల ఆర్థిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. మొగుళ్లపల్లి మండలంలో మంగళవారం మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమంలో నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళా సంఘాలకు సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, క్యాంటీన్లు వంటి అవకాశాలను ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో సోలార్ కేంద్రం, పారిశ్రామిక పార్క్, రెసిడెన్షియల్ పాఠశాల, రోడ్ల నిర్మాణం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. జిల్లాలో 6107 మహిళా సంఘాలకు 3.20 కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేసినట్లు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.





# మా అధికారం.. మా ఇష్టం!

- ఇసుక మాఫియాలో స్థానిక లీడర్ల 'హస్తం'
- ఇసుక క్వారీల్లో ఆగని అక్రమ వసూళ్ల దందా
- లోడింక్ ఛార్జీలు ఇస్తేనే ఇసుక లోడింగ్ చేస్తామని కాంట్రాక్టర్ల తీరు
- మాయ చేస్తున్న బినామి కాంట్రాక్టర్లు
- యథేచ్చగా అక్రమ వసూళ్ల దందా
- పచ్చ జెండా ఊపుతున్న అధికారులు

అక్షరదర్బార్, కాటారం : అధికారం మా చేతుల్లో ఉందంటూ అధికార పార్టీలోని కొందరు చోటా మోటా లీడర్లు బరి తెగిస్తున్నారు. ఏం చేసిన మా ఇష్టమేనంటూ సదరు లోకల్ లీడర్లు బినామీ ఇసుక కాంట్రాక్టర్లకు 'హస్తం' ఇస్తూ వత్తాసు పలుకుతున్నారు. ఇక్కడ మేం లోకల్ అని అధికారం మా చెంత ఉందని మీకేం కాదని ఇసుక కాంట్రాక్టర్లకు చోటా మోటా లీడర్లు అభయ'హస్త'మిస్తుండగా మాకెవ్వరు అడ్డంటూ ఇసుక మాఫియా రాజ్యమేలుతున్నది. దీంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని ఇసుక క్వారీల కేంద్రంగా అవినీతి అక్రమాలు అడ్డూ అదుపు లేకుండా సాగుతోంది.ఈ క్రమంలో ఇసుక క్వారీల్లో వారి అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సజావుగా సాగుతుండగా అంతా ఏకమై చెరో షేర్ అంటూ అందరూ హాయిగా అక్రమ డబ్బులు పంచుకుంటుండం గమనార్హం. ముఖ్యంగా బొమ్మాపూర్ –4, మహదేవపూర్ –4 పేరుతో నడుస్తున్న ఇసుక క్వారీల్లో ఈ అవినీతి తంతు నడుస్తుండగా ప్రశ్నించే వ్యవస్థ కాస్తా నోరు వెళ్లబెట్టుకుని చూడడం చర్చనీయాంశమవుతున్నది.

## - అఫీషియల్ గానే అవినీతికల్ దందా..

ఇసుక క్వారీల్లో లోడింగ్ ఛార్జీల పేరుతో నడుస్తున్న అక్రమ వసూళ్ల బాగోతాన్ని సదరు కాంట్రాక్టర్లు అఫీషియల్ చేసుకున్నారు. అసలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం లోడింగ్ చార్జీలంటూ ఏం ఉండకపోగా వాటిని ఆఫీషియల్ చేసుకుని సదరు ఇసుక కాంట్రాక్టర్లు అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్న తీరు ఔరా అనిపిస్తుంది. ఈ నేపథ్యంలో ఆయా క్వారీల్లో ఒక్కో లారీని లోడ్ చేస్తే రూ. 4 వేలు ఇవ్వాల్సిందేనని లేకుంటే లోడింగ్ చేసేదేలేదని కాంట్రాక్టర్లు హుకూం జారీ చేస్తుండగా చేసేదేం లేక ఇసుక లారీల డ్రైవర్లు, ఓనర్లు అడిగిన కాడికి ముట్టజెప్పి వెళ్లిపోతున్నట్లు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఆ రెండు ఇసుక క్వారీల కాంట్రాక్టర్లు ఒక్కో క్వారీకి రోజూ సుమారు రూ.4 లక్షల నుండి 6 లక్షల మేరా అక్రమ వసూళ్లకు పాల్పడుతూ వ్యవస్థనే రూల్ చేస్తున్నారు. గతంలో ప్రభుత్వం ఈ అక్రమ వసూళ్ల తీరుపై స్పెషల్ ఫోకస్ పెట్టి అన్నీ బంద్ చేయగా కొన్ని నెలల వ్యవదిలోనే ఇసుక కాంట్రాక్టర్లు తిరిగి వాటిని పున:ప్రారంభించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న తీరు అయోమయానికి గురిచేస్తుంది.

## - పచ్చ నోటుతో పచ్చ జెండా..!

ఇసుక క్వారీల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలను కాస్తా అడ్డుకట్ట వేయాల్సిన సంబంధిత అధికార వ్యవస్థ పచ్చ నోటు తీసుకుని పచ్చ జెండా ఊపుతుందనే ఆరోపణలు అంతటా వ్యక్తమవుతున్నది. ఈ క్రమంలో వీరికి మంత్లీ చొప్పున సదరు కాంట్రాక్టర్లు అక్రమ వసూళ్ళలో భాగస్వామ్యం కల్పిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతుంది. అందులో ముఖ్యంగా ప్రధాన అనుబంధ శాఖకు చెందిన ఆ ప్రధాన అధికారికి మంత్లీ చొప్పున లక్షల్లో వెళుతున్నట్లుగా తెలుస్తోంది. అలాగే క్వారీల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన డీల్ చేసే మరో శాఖకు నెలకు లక్ష చొప్పున జీతం మాదిరి ఇస్తున్నట్లుగా టాక్ నడుస్తుంది. దీంతో సదరు ఇసుక క్వారీ కాంట్రాక్టర్లు అధికార యంత్రాంగమే తమ చెంతన ఉందంటూ ఏం చేసుకుంటారో చేసుకోండంటూ ఓపెన్ గానే ఛాలెంజ్ విసురుతున్నట్లుగా ఇన్ఫర్మేషన్. ఇటీవల బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ఇసుక క్వారీలను సందర్శించి అక్రమ వసూళ్ళను ప్రశ్నించగా ఓ కాంట్రాక్టర్ అందరికీ అన్నీ అప్పజెప్పే మా దందాను నడిపిస్తున్నామని మీ రేటు ఎంతో చెప్తే సెటిల్ చేస్తామని చెప్పడం కొసమెరుపు. దీనిపై బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు వినతి పత్రం ద్వారా ఫిర్యాదు చేసినప్పటికి చర్యలు మాత్రం శూన్యంగా మారాయని బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు.

# సీరోల్, మరిపెడ పీఎస్‌లలో ఎస్పీ తనిఖీ



అక్షరదర్బార్, మరిపెడ : మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ మంగళవారం సీరోల్, మరిపెడ సర్కిల్, మరిపెడ పోలీస్ స్టేషన్లు సందర్శించారు. మరిపెడలో నిర్మాణంలో ఉన్న కొత్త పోలీస్ స్టేషన్ భవనం పనులను ఆయన పరిశీలించారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిసరాలు, శుభ్రత, భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు తెలుసుకుని, దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. రాబోయే గ్రామ పంచాయితీ ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశించారు. ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్పీ వెంట మరిపెడ సీఐ రాజకుమార్ గౌడ్, ఎస్ఐ విరభద్రం, సీరోల్ ఎస్ఐ సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబ సభ్యులకు పరామర్శ



అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలం సూర్య నాయక్ తండ గ్రామానికి చెందిన మాలోతు శాంతమ్మ ఇటీవల అనారోగ్యతో మరణించారు.గ్రామ యువ నేత తీన్మార్ జయ్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో గ్రామ యువకులు తీన్మార్ జయ్,మాలోతు అజిత్, కుమార్,మోహన్,లోకేష్,రాజు, గణేష్,సురేష్,భూక్య భాస్కర్, వీరన్న,రాజ్ కుమార్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపేదే లే..!

- కాటారం, మహాదేవపూర్ మండలాల్లో ఆగని హోమ్లీ పేకాట
- ఇండ్లను మకాంగా మార్చుకుని ఆట
- తాజా మాజీ లీడర్లే పాత్రధారులు
- నిరంతరం సాగుతున్న హోమ్లీ పేకాట
- జిల్లా పోలీస్ బాస్ పైనే అందరి చూపు
- పేకాటపై ఫోకస్ చేయాలని వేడుకోలు



అక్షరదర్బార్, కాటారం: జీవితాలను నాశనం చేసే పేకాట రక్కసి కొత్త రూపం దాల్చుకుంది. గతంలో పేకాట ఆడాలంటే సమాజానికి దూరంగా ఆడుకునే పేకాట రాయుళ్లు కాస్తా సాంప్రదాయ ఇండ్లకే మకాం మార్చి వ్యవస్థకే ఓపెన్ ఛాలెంజ్ విసురుతున్నారు. రాజకీయ ప్రముఖుల ఇండ్లల్లో ఈ హోమ్లీ పేకాట తతంగాన్ని సాగిస్తుండగా పేకాటను వ్యసనంగా మార్చుకున్న పేకాట రాయుళ్ళు ధైర్యంగా పేకాట ఆడుతూ తమ జీవితాలను చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. కాటారం, మహదేవపూర్ మండలాల్లో ఈ హోమ్లీ పేకాట జోరుగా సాగుతుండగా పట్టించుకోవాల్సిన నిఘా వ్యవస్థ కాస్తా మిన్నకుంటున్న తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## - తాజా మాజీ లీడర్లే పాత్రధారులు

కాటారం మండలకేంద్రంతో పాటు దేవరాంపల్లి, గంగారం ఎక్స్ రోడ్డు, కొత్తపల్లి గ్రామాల్లో హోమ్లీ పేకాట నడుస్తుండగా మహదేవపూర్ మండలకేంద్రంతో పాటు బొమ్మాపూర్, సూరారం, అంబట్ పల్లి గ్రామాల్లోనూ హోమ్లీ పేకాట స్థావరాలు ఏర్పడినట్లు సమాచారం. అయితే గత కొన్ని నెలలుగా నడుస్తున్న హోమ్లీ పేకాట బాగోతంలో పలు రాజకీయ పార్టీలకు చెందిన తాజా మాజీ లీడర్లే సూత్రధాయకంగా వ్యవహరిస్తూ పాత్రధారులు కావడం విశేషం. సమాజంలో పలుకుబడి వ్యక్తులుగా పేరు గాంచిన వ్యక్తులే ఈ పేకాటను పెంచి పోషిస్తుండగా అమాయకులు జేబులు గుల్లచేసుకుంటున్నారు. గతంలో కాటారం సబ్ డివిజన్ పరిధిలో నామినేటెడ్ పోస్ట్ లో పనిచేసిన మహిళ భర్త కీలక పాత్రదారిగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

## - కొత్త పోలీస్ బాస్ మార్క్ పైనే అందరి దృష్టి..!

గత కొన్ని నెలలుగా నడుస్తున్న హోమ్లీ పేకాటను ఇటీవల జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సంకిశెట్టి సంకీర్త్ ఎలా కూకటివేళ్లతో పెకిలించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. జిల్లా బాస్ తెలంగాణ ప్రాంత వాసి కావడం అందులో బెల్లంపల్లి నివాసి కావడం విశేషం.